డిసెంబర్ 7,
దత్త జయంతి

డిసెంబర్ 2022

# గురువాణి

శ్రీవిద్యా జ్ఞాన పీఠం ఆధ్యాత్మిక మాస పత్రిక



**శ్రీవిద్యా మందిరాలు**
అయ్యవాడి ప్రత్యంగిరా దేవి

తిథి నిత్యా దేవీ యజనం
**శ్రీవిద్యా సాధన**

గురూజీ
**కాశీ యాత్ర విశేషాలు**

**ఏకాదశి నాడు ఉపవాసం ఉండాలా? దాని ప్రాముఖ్యత ఏమిటి?**



# శ్రీ వారాహి ధ్యానం

మాతర్వారాహి జాతే తవ చరణ సరోజార్చనం వా జపం వా
కర్త్రుం శక్తోనచాహం తదపిచ సదయే మయ్యతస్త్వాం హి యాచే
యస్త్వాం దంష్ట్రాశితాగ్రాం త్రినయన లసితాం చారు భూదార వక్త్రాం
మూర్తిం చిత్తే విధిస్తే తదరిగణ వినాశోస్తు తస్మిన్ క్షణేవై

# గురువాణి
విషయ సూచిక

**గురువాణి ఆధ్యాత్మిక మాస పత్రిక**
సంపుటి -1 సంచిక - 4, డిసెంబర్ 2022

**గురువాణి** డిజిటల్ తెలుగు మాస పత్రిక, శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్ వారిచే ముద్రించబడినది.

గురువాణి సమాచార పత్రిక ను అందరికీ షేర్ చేయడం, యూ ట్యూబ్ ఛానల్ మరియు ఫేస్ బుక్ పేజి లలో చేరడం ద్వారా పీఠం యొక్క కార్యక్రమాలలో మీరు భాగస్వాములు కావచ్చును.

Subscribe Newsletter | Follow on Facebook | Subscribe YouTube

©Srividya Learning Centre

**శ్రీవిద్య లెర్నింగ్ సెంటర్**
(సౌందర్య లహరి యొక్క ఒక విభాగము)

#69, 6th Cross Street, Girinagar Phase I,
Bengaluru, K A 560085, India.

srimeru999@gmail.com

+91 8088256632

www.srimeru.org

| ఈ సంచికలో | పేజీ |
|---|---|
| **కవర్ పేజీ చిత్రము** ప్రత్యంగిరా దేవి | |
| **ధ్యానం** శ్రీ వారాహి ధ్యానం | 02 |
| **గురువాణి** ఏకాదశి నాడు ఉపవాసం ఉండాలా? | 04 |
| **శ్రీవిద్యా సాధన** తిథి నిత్యా దేవీ యజనం | 06 |
| **కాశీ యాత్రా విశేషాలు** | 11 |
| **శ్రీవిద్యా మందిరాలు** అయ్యవాడి ప్రత్యంగిరా దేవి మందిరం | 12 |
| **జరిగిన కార్యక్రమాలు** | 15 |
| **రాబోయే కార్యక్రమాలు** | 16 |
| **సాధకుల అనుభవాలు** | 17 |
| **ప్రశ్నలు – సమాధానములు** | 20 |





# ఏకాదశి నాడు ఉపవాసం ఉండాలా? దాని ప్రాముఖ్యత ఏమిటి?

## శ్రీ గురు కరుణామయ

ఏకాదశి ఉపవాస ప్రాముఖ్యాన్ని వర్ణించేటటువంటి పుస్తకాలు చాలా ఉన్నాయి. ఉపవాసము అంటే అందరికి అర్థం తెలుసు. ఉప అంటే దగ్గర, వాసము అంటే ఉండడము. ఉపవాసము అంటే భగవంతునికి దగ్గరగా ఉండడం.

ఏకాదశి అంటే 11 వ రోజు. 15 తిథులకు వరుసగా 15 మంది తిథి నిత్యా దేవతలలో, నీలపతాక అన్నటువంటి నిత్యా దేవి ఏకాదశి నాడు ఉంటుంది, ఆ రోజుకి ఆమె అధిష్ఠాన దేవత.

నీలము అంటే అనంతము. పతాకం అంటే విజయ చిహ్నం. అనంతాన్ని గెలిచినటువంటి విజయ చిహ్నం ఆ రోజు. ఈ అనంతం ఏమిటంటే, పది సంఖ్యను దాటాము. పది సంఖ్య గురించి ఆలోచిస్తే, ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు - ఈ పది ఇంద్రియములు కలిగించేటటువంటి వికారములను మనము దాటినందుకు చేసుకునే మహోత్సవ దినం ఏకాదశి.

ఏకాదశి, ఏకాదశ రుద్రులకు కూడా సంకేతం. పదకొండు మంది రుద్రులు. ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, బుద్ధి. వీటిలో ఉన్న ప్రాణమును మనకి తెలియకుండా గ్రహించి, మనల్ని, మన చుట్టూ ఉన్నవాళ్ళని ఏడిపించే వాడు రుద్రుడు అని చెబుతారు. ఆ విధంగా, రుద్ర స్వరూపం, ద్రష్టగా ఉండేటటువంటి రోజు ఏకాదశి. ఏకాదశి విష్ణుమూర్తికి సంబంధం అంటారు. నిజానికి ఏకాదశి రుద్రుడికి కూడా సంబంధమే.

ఇంద్రియముల మీద మనకు ఉన్నటువంటి నియంత్రణ శక్తిని నిరూపించుకునే ఒక రోజుగా ఈ ఏకాదశిని గ్రహించ వచ్చును. అందుచేత, “నేను ఇంద్రియ నిగ్రహంతో ఉంటాను. రోజు తినేటటువంటి అన్నాన్ని ఈ రోజు నేను భుజించను” అని సంకల్పం చేసుకోవాలి. కానీ, నేను అన్నాన్ని భుజించను అని చెప్పేసి, పొద్దున్న లేచిన దగ్గరి నుండి, “అన్నం భిన్నం అయితే పరవాలేదు, కొబ్బరికాయ తినవచ్చును, అరటిపండు తినవచ్చును” అని మనస్సు ఎప్పుడూ వంటింటి చుట్టూ తిరుగుతూ ఉంటే, అది ఉపవాసం కాదు - వంటింటి వాసం అవుతుంది. అలాంటప్పుడు ఎలాంటి పూజలు చేసినా ఫలితం ఉండదు.

ఏకాదశి రోజున, ఉదయం నిద్ర లేచినప్పటినుండి, ప్రాపంచిక విషయాల నుండి పక్కకి రావాలి. పిల్లలని స్కూల్ కి పంపించడం, భర్తకి వండి పెట్టడం ఇలాంటి ముఖ్యమైన పనులు అయిపోయాక, మనకున్న మిగిలిన మొత్తం సమయాన్ని భగవంతుని సేవలో వినియోగించాలి. భగవన్నామం స్మరిస్తూ లేదా పూజ చేస్తూ లేదా వ్రతం చేస్తూ లేదా అభిషేకం చేస్తూ లేదా హోమం చేస్తూ లేదా ఏదో ఒక ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొంటూ... అమ్మకి దగ్గరగా ఉండడం చేయాలి. ఎంత సేపు ఉండగలమో అంతసేపు ఉండాలి. “మనయేవ కారణం, మనుష్యాణాం బంధమోక్షయో” అనిచెప్పినట్లు, ఆ మనసుని మన అదుపు లోకి తెచ్చుకుని, భగవంతునికి దగ్గరగా ఉండడమే ఉపవాసం.

# గురువాణి

## గురూజీ సందేశము

ఏకాదశి ఉపవాసం వలన ఫలితం ఏమి వస్తుంది- అంటే, భగవంతునికి దగ్గరగా ఉంటే, భగవంతుని యొక్క లక్షణాలు మనలో ఆపాదించబడి, భగవంతుని యొక్క అనుగ్రహం మనకి పూర్తిగా లభించి, మనలో ఉన్నటువంటి భగవత్ స్వరూపాన్ని మనం తెలుసుకునే ప్రయత్నం చేస్తాము. ఇది ఏకాదశి ఫలితం.

"కేవలం ఒక ఉపవాసం చేస్తే చాలు", "ఒక ఏకాదశి నాడు ఉపవాసం చేస్తే వాళ్లకు వచ్చే ఫలితాన్ని వర్ణించడానికి అలవి కాదు" - ఇలా చెబుతూ ఉంటారు. విజ్ఞాన పరంగా కూడా శాస్త్రజ్ఞులు, ఒక రోజు భోజనం మానేస్తే మంచిదే అని చెబుతూ ఉంటారు కదా! ఏకాదశి 15 రోజులకు ఒకసారి వస్తుంది. నెలకి రెండు రోజులు. ఆ రెండు రోజులూ ఉపవాసం ఉండవచ్చును. అయితే ఉపవాసం అంటే లంఖణం అని ఎక్కడా చెప్పబడలేదు.

ఏకాదశి నాడు, "మా ఇంట్లో సత్యనారాయణ వ్రతం చేసుకుంటున్నాము. మీరు వచ్చి భోంచేస్తే మనకు తృప్తిగా ఉంటుంది" అని ఎవరైనా పిలిస్తే, అక్కడకు వెళ్లి, భోజనం చెయ్యడమే ఉపవాసం. ఎందుకంటే, అలా భగవంతుడే పిలిచాడు అని భావించాలి. తన ప్రసాదం తినమని దైవమే నిన్ను పిలుస్తోంది. అలా చేస్తే, మన ప్రయత్నం లేకుండా మనం ఉప వాసము చేసినట్లే అవుతుంది.

కానీ, "నేను ఉపవాసం ఉన్నాను, ఈ రోజు మనము ఏమీ తినను" అని చెప్పటం సరైనది కాదు. ఆ రోజు, భగవంతునికి దగ్గరగా ఉండడమే ఉపవాసం కింద పరిగణించబడుతుంది. కొంత మంది "పులిహోర తినకూడదు, కొబ్బరి ముక్క ప్రసాదంగా తినవచ్చును" అని చెబుతూ ఉంటారు. ప్రసాదంలో అన్నము, కొబ్బరి ముక్క అనే తేడాలు ఉండవు కదా! అందుచేత, ఈ మాయలో పడకుండా, ఒకరోజు ఇంద్రియ నిగ్రహంతో ఉంటూ, ఏక భుక్తంగా, అంటే రాత్రి మాత్రం భోజనం చేసి, తదేకంగా దైవ ధ్యానం మీద దృష్టి ఉంచాలి. సత్యనారాయణ వ్రతంలో కట్టెలు అమ్ముకునే వాడి గురించి కూడా "ఆ క్షణములో బ్రాహ్మణుడు చేసుకుంటున్న సత్యనారాయణ వ్రతము చూడగానే, నారాయణ శబ్దం వినపడగానే, ఆకలి దప్పికలు మర్చిపోయి, చేస్తున్నటువంటి వ్యాపారం కూడా మర్చిపోయి, లోపలికి వెళ్ళాడు" అని చెబుతారు. అంత తాదాత్మ్యంతో ఉండడమే ఉపవాసం.

ఏకాదశి ఉపవాసం చేయడం మంచిదే. కానీ, భోజనం మానేయడమే ఉపవాసంగా పరిగణించబడదు. దానితో పాటు మరొకటి చెయ్యవలసింది ఉన్నది. అదే భగవంతుని యొక్క ధ్యానం. అందుకే, సత్యనారాయణ వ్రతం కూడా, "ఏ దినము నందు చేసినా, సాయంకాలం ఈ వ్రతం చెయ్యడం మంచిది, వ్రతం చేసాక, బంధు మిత్రులతో కలిసి భోజనం చేస్తూ, ఆ దినమంతా కూడా సత్య దేవునికి ప్రీతిగా, నృత్యములు, గీతములతో, భజనలతో కాలము గడిపి ఎవరైతే చేస్తారో, వారికి సత్యనారాయణ స్వామి యొక్క అనుగ్రహం కలుగుతుంది" అని చెబుతారు. మనలో కొందరు బ్రాహ్మణుడిని పిలిచి "ఒక గంటలో పూజ అయిపోవాలండీ! తరవాత మనము ఆఫీస్ కి వెళ్ళిపోవాలి" అని అడుగుతూ ఉంటారు. అలా మొక్కుబడిగా చేయటం వలన ఫలితం దొరకదు. ఉదయము నిద్ర లేచినప్పటినుండి, నారాయణ నామ స్మరణ నిరంతరం జరుగుతూ ఉండాలి. కనీసం ఆ స్వామి వారి నామము, పాటలు లేదా స్తోత్రములు వింటూ ఉండాలి.

మనం చేసే వ్రతము, మనం పొద్దున్న నిద్ర లేచినప్పుడే మొదలై పోయింది. "బ్రహ్మ గారు వచ్చాకే మొదలవుతుంది" అనుకోవడం సరి కాదు. వినాయక చవితి నాడు కూడా పొద్దున్న నిద్ర లేచిన దగ్గరి నుండి గణపతి మంత్రం మనసులో చెప్పుకుంటూ ఉండాలి. "ఓం గం గణపతయే నమః" అని ఎవరైనా చెప్పుకోవచ్చు. ఆ మంత్రం చెప్పుకుంటూ స్నానం చేసి, ఆ మంత్రం చెప్పుకుంటూ వంట చేసి, ఆ మంత్రం చెప్పుకుంటూ పాలవెల్లి అలంకరించి, గణపతిని అలంకరించి - ఇది అంతా కూడా గణపతి వ్రతమే అని అనుకోగలిగితే, అది నిజమైనటువంటి ఉపవాసం. మధ్యలో కుడుములు తిన్నా, ఏమి తిన్నా ఫరవాలేదు. ఉపవాసం అంటే, భగవంతుని ధ్యానంతో ఆ పరమాత్మకు దగ్గరగా ఉండడమే.

Guru Karunamaya

శ్రీ గురు కరుణామయ

# తిథి నిత్యా దేవీ యజనం

శ్రీ విద్యా సాధనలో నిత్యా దేవతల పూజ ఎంతైనా ఉపయోగపడుతుంది. ప్రకృతిలో ఉన్నటువంటి పదహారు (16) నిత్యా దేవతల నిత్యార్చన పామర జనులకు కూడా అనేక సమస్యలను తీర్చి, దివ్యౌషధంగా పని చేస్తుంది.

ఈ పూజ చేయడము చాలా సులభము. శుక్ల పక్ష పాడ్యమి నాడు మొదలు పెట్టి, కామేశ్వరి, భగమాలిని, నిత్యక్లిన్న..మొదలైన పదహారుమంది నిత్యలను ఏ రోజు నిత్యా దేవతను ఆ రోజు అర్చనం చేయాలి. కృష్ణ పక్ష పాడ్యమి నాడు మరలా కామేశ్వరితో ప్రారంభించి వరుసగా చేస్తూ, చివరగా అమావాస్య నాడు అమావాస్య నాడు మహా నిత్య అర్చనం చేయాలి. ఇలా ఎవరైతే అర్చన చేస్తారో, వారికి ఇహ పర భోగాలకు లోటు లేదని శాస్త్రం చెబుతున్నది.

ఈ నీత్యా దేవీ పూజలో భాగంగా, ప్రతి నిత్య దేవతకు పంచోపచారాలు కానీ, షోడశోపచారాలు(16) కానీ శక్తిని బట్టి చేసుకుంటే, మంచిది.

## పూజా విధానము

ప్రతి రోజూ చేసే పూజా విధానంలో, తిథి నిత్యా దేవతా మండలంలో 16మంది తిథి నిత్యా దేవతల ఆవాహనం వరకు మార్పు లేకుండా ఒకే విధానం ఉంటుంది. తరువాత వచ్చే షోడశోపచారములలో, తిథి నిత్యా దేవతా మంత్రము, తిథి నిత్యా గాయత్రి మొదలైనవి మాత్రము మారుతూ ఉంటాయి.


- **గురుధ్యానం**
- **గణపతి ధ్యానం**
- **ఆచమనం**
- **ప్రాణాయామం**

**సంకల్పం**
కుడి కుడి చేతిలో పసుపు కలిపిన అక్షతలు తీసుకుని, గుప్పిట మూసి, ఎడమ అరచేయి మీద, కుడి గుప్పిటను ఉంచి, రెండింటినీ కలిపి కుడి తొడ మీద ఉంచుకొని, ఈ క్రింది సంకల్ప పాఠాన్ని చెప్పాలి.

**మమ ఉపాత్త సమస్త దురిత క్షయ ద్వారా, కామేశ్వరీ నిత్యా దేవతాముద్దిశ్య, కామేశ్వరీ నిత్యా దేవతా ప్రీత్యర్థం కామేశ్వరీ నిత్యా దేవతా నిత్య పూజాం కరిష్యే.**

పై మంత్రం చెప్పిన పిదప అక్షతలను నీటితో పాటు ఒక పళ్లెంలో విడిచి పెట్టాలి.

ఒక పీట మీద పెద్ద త్రికోణాన్ని గీసుకుని(త్రికోణం దిగువ వైపు చూడాలి) దానిలో ఒక్కొక్క భుజమునకు అయిదు నిత్యలకు ప్రతీకగా అయిదు పుష్పములనుంచి, మధ్యలో మహా నిత్యకు ప్రతీకగా ఒక పెద్ద పుష్పమును ఉంచాలి.




కుడి చేతిలో పుష్పాక్షతలు పట్టుకుని, క్రింది శ్లోకాలను చదువుతూ, ఆవాహయామి అని అన్నప్పుడు ఆయా నంబర్ల స్థానాలలో ఉన్న పుష్పాలమీద పుష్పాక్షతలు ఉంచాలి.

1. **కామేశ్వరి**
ఐం హ్రీం శ్రీం అం కామేశ్వరీ నిత్యా దేవతాం ఆవాహయామి
**2. భగమాలిని**
ఐం హ్రీం శ్రీం ఆం భగమాలినీ నిత్యా దేవతాం ఆవాహయామి
**3. నిత్యక్లిన్న**
ఐం హ్రీం శ్రీం ఇం నిత్యక్లిన్నా నిత్యా దేవతాం ఆవాహయామి
**4. భేరుండ**
ఐం హ్రీం శ్రీం ఈం భేరుండా నిత్యా దేవతాం ఆవాహయామి
**5. వహ్నివాసిని**
ఐం హ్రీం శ్రీం ఉం వహ్నివాసినీ నిత్యా దేవతాం ఆవాహయామి
**6. మహా వజ్రేశ్వరి**
ఐం హ్రీం శ్రీం ఊం మహా వజ్రేశ్వరీ నిత్యా దేవతాం ఆవాహయామి
**7. శివదూతి**
ఐం హ్రీం శ్రీం ఋం శివదూతీ నిత్యా దేవతాం ఆవాహయామి
**8. త్వరిత**
ఐం హ్రీం శ్రీం ౠం త్వరితా నిత్యా దేవతాం ఆవాహయామి
**9. కుల సుందరి**
ఐం హ్రీం శ్రీం ఌం కులసుందరీ నిత్యా దేవతాం ఆవాహయామి
**10. నిత్య**
ఐం హ్రీం శ్రీం ౡం నిత్యా నిత్యా దేవతాం ఆవాహయామి
**11. నీలపతాక**
ఐం హ్రీం శ్రీం ఏం నీలపతాకా నిత్యా దేవతాం ఆవాహయామి
**12. విజయ**
ఐం హ్రీం శ్రీం ఐం విజయా నిత్యా దేవతాం ఆవాహయామి
**13. సర్వమంగళ**
ఐం హ్రీం శ్రీం ఓం సర్వమంగళా నిత్యా దేవతాం ఆవాహయామి
**14. జ్వాలామాలిని**
ఐం హ్రీం శ్రీం ఔం జ్వాలామాలినీ నిత్యా దేవతాం ఆవాహయామి

**15. చిత్రా**
ఐం హ్రీం శ్రీం అః చిత్రా నిత్యా దేవతాం ఆవాహయామి
**16. మహా నిత్యా**
ఐం హ్రీం శ్రీం అహం షోడశీ మహా నిత్యా దేవతాం ఆవాహయామి.
ఈ విధంగా పదహారు నిత్యలతో ఉన్న నిత్యా దేవతా మండలం ఆవాహన అయింది.

నిత్యా దేవతా మండలం లో ఒక్కొక్క నిత్యా దేవతకు ఒక్కొక్క రోజు షోడశోపచార పూజ చేయాలి.

## షోడశోపచార పూజ

**మొదటి రోజు కామేశ్వరీ నిత్యా దేవతా పూజ (శుక్ల పాడ్యమి)**
కుడి చేతిలో పుష్పాక్షతలు పట్టుకుని, క్రింది శ్లోకాన్ని పఠిస్తూ మరొకసారి, కామేశ్వరి దేవతకు ప్రతీకగా ఉన్న పుష్పం మీద ఉంచి కామేశ్వరీ దేవతను ప్రత్యేకంగా ఆవాహనం చేయవలెను.

**1. ధ్యానం, ఆవాహనం**
హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం
చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మ ఆవహ
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః ధ్యాయామి ఆవాహయామి.
అని చెబుతూ, అమ్మవారిని ఆవాహనం చేయవలెను.

**2. ఆసనం**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః రత్న సింహాసనం సమర్పయామి.
అని చెబుతూ అక్షతలు సమర్పించవలెను.

**3. పాద్యం**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః పాదయోః పాద్యం సమర్పయామి.
అని చెబుతూ అమ్మవారి పాదములు కడుగుతున్నట్లు భావిస్తూ ఒక ఉద్ధరిణి నీటిని పళ్లెములో వదలవలెను.

**4. అర్ఘ్యం**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః హస్తయోః అర్ఘ్యం సమర్పయామి.
అని చెబుతూ అమ్మవారి చేతులు కడుగుతున్నట్లు భావిస్తూ ఒక ఉద్ధరిణి నీటిని పళ్లెములో వదలవలెను.

**5. ఆచమనం**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః ముఖే ఆచమనీయం సమర్పయామి.
అని చెబుతూ అమ్మవారికి నీరు అందించినట్లు భావిస్తూ ఒక ఉద్ధరిణి నీటిని పళ్లెములో వదలవలెను.

**6. స్నానం**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః స్నపయామి.
అని చెబుతూ అమ్మవారికి స్నానం చేయించినట్లు భావిస్తూ ఒక ఉద్ధరిణి నీటిని పళ్లెములో వదల వలెను.

**7. వస్త్రం**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః వస్త్రం సమర్పయామి.
అని చెబుతూ అమ్మవారికి వస్త్రములు సమర్పించినట్లు భావిస్తూ అక్షతలు సమర్పించవలెను.

**8. హరిద్రా కుంకుమ**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః హరిద్రా కుంకుమం సమర్పయామి.
అని చెబుతూ అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించవలెను.

**9.గంధం**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః గంధం సమర్పయామి.
అని చెబుతూ అమ్మవారికి గంధం సమర్పించవలెను.

**10. పుష్పం**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః పుష్పైః పూజయామి.
అని చెబుతూ, అమ్మవారికి పుష్పములు, పసుపు, కుంకుమ, అక్షతలు వీనిలో ఏదైనా ఉపయోగిస్తూ క్రింద ఇవ్వబడిన క్రింద ఇవ్వబడిన నిత్యా దేవత మూలమంత్రాన్ని 16 సార్లు గానీ 108 సార్లు గానీ పఠిస్తూ పూజ చేయవలెను.
ఐం హ్రీం శ్రీం అం ఐం స క ల హ్రీం నిత్యక్లిన్నే మదద్రవే సౌః అం కామేశ్వరీ నిత్యా శ్రీ పాదుకాం పూజయామి తర్పయామి నమః

**11. ధూపం**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః ధూపమాఘ్రాపయామి.
అని చెబుతూ అమ్మవారికి ధూపము చూపించవలెను.

**12. దీపం**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః దీపం దర్శయామి.
అని చెబుతూ అమ్మవారికి దీపము చూపించవలెను.

**13. నైవేద్యం**
అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః నైవేద్యం సమర్పయామి.
ఒక పళ్లెములో పళ్లు / పక్వాన్నములు (అప్పుడే వండిన పదార్థములు) నైవేద్యముగా ఉంచి, ఆ పళ్లెము చుట్టూ ప్రదక్షిణంగా (ఎడమ వైపు నుండి కుడివైపుకు) నీరు చల్లుతూ, క్రింద ఇవ్వబడిన మంత్రమును చెప్పవలెను.

**ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్**
**ఓం ఆపోజ్యోతి రసోమృతం బ్రహ్మ భూర్భువస్సువరోం**

తరువాత, **అమృతమస్తు** అని చెబుతూ, నైవేద్యంపైన ఒక చుక్క నీటిని చల్లవలెను.
తరువాత నైవేద్యం చుట్టూ నీటిని చల్లుతూ క్రింది మంత్రమును చెప్పవలెను

**అమృతో పస్తరణమసి, సత్యంత వర్తేన పరిషించామి** (పగటి పూట నైవేద్యం పెట్టేటప్పుడు)
**అమృతో పస్తరణమసి, ఋతంతాత్వర్తేన పరిషించామి** (రాత్రి పూట నైవేద్యం పెట్టేటప్పుడు)
**అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః నైవేద్యం సమర్పయామి**" అని చెప్పి, తరువాత క్రింది మంత్రములను చదువుతూ, ఆరు సార్లు అమ్మవారికినైవేద్యమును సమర్పించవలెను.

**ఓం ప్రాణాయ స్వాహా**
**ఓం అపానాయ స్వాహా**
**ఓం వ్యానాయ స్వాహా**
**ఓం ఉదానాయ స్వాహా**
**ఓం సమానాయ స్వాహా**
**ఓం బ్రహ్మణే స్వాహా**

ఇలా నైవేద్యం సమర్పించిన తరువాత, అమ్మవారికి నీరు త్రాగటానికి ఇస్తున్నట్లు భావన చేస్తూ, ఒక ఉద్ధరిణితో నీటిని తీసుకుని,
**మధ్యే మధ్యే పానీయం సమర్పయామి** అని చెబుతూ, ఉద్ధరిణి లోని నీటిని అమ్మవారికి చూపించి , ఆ జలమును మీరు స్వీకరించవలెను.

- తరువాత, పళ్లెం చుట్టూ అప్రదక్షిణంగా (కుడి వైపు నుండి ఎడమ వైపుకు) నీటిని చల్లుతూ, అమృతాపిధానమసి ఉత్తరాపోశనం సమర్పయామి అని చెప్పవలెను.
- అమ్మవారి చేతులు కడుగుతున్నట్లు భావిస్తూ, **హస్తౌ ప్రక్షాళయామి** అని చెబుతూ, ఉద్ధరిణితో నీటిని అమ్మవారికిచూపించి, పళ్లెములో విడువవలెను.
- అమ్మవారి కాళ్లు కడుగుతున్నట్లు భావిస్తూ, **పాదౌ ప్రక్షాళయామి** అని చెబుతూ, ఉద్ధరిణితో నీటిని అమ్మవారికిచూపించి, పళ్లెములో విడువవలెను.
- అమ్మవారికి త్రాగటానికి నీరు ఇస్తున్నట్లుగా భావిస్తూ, **ఆచమనీయం సమర్పయామి** అని చెబుతూ, ఉద్ధరిణితో నీటిని అమ్మవారికిచూపించి, పళ్లెములో విడువవలెను.

**14. నీరాజనం**
హారతి కర్పూరం వెలిగించి అమ్మవారికి చూపిస్తూ గంట వాయిస్తూ క్రింది మంత్రములను చెప్పవలెను.
**అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః ఆనంద కర్పూర నీరాజనం దర్శయామి.**
- ఇక్కడ హారతి పాట పాడవచ్చును.
- తరువాత పళ్లెములో ఒక చుక్క నీటిని విడువ వలెను.
- హారతి యొక్క ఉష్ణాన్ని (వేడిని) రెండు చేతులతోటి కళ్లకు అద్దుకుంటూ, "రక్షాం ధారయామి" అని చెప్పవలెను.

**15. మంత్రపుష్పం**
పుష్పములు మరియు అక్షతలు కుడి చేతిలోనికి తీసుకుని,

**అం కామేశ్వరీ నిత్యా దేవ్యై శుక్ల ప్రతిపద్ రూపిణ్యై అమృతాయై నమః మంత్ర పుష్పం సమర్పయామి.**
**కామేశ్వర్యైశ్చ విద్మహే నిత్యక్లిన్నాయై ధీమహి**
**తన్నో నిత్యా ప్రచోదయాత్ ( నిత్యా గాయత్రి )**
**కామాకర్షణ్యై విద్మహే రక్త వస్త్రాయై ధీమహి**
**తన్నః కళా ప్రచోదయాత్ (కళా గాయత్రి)**

అని స్తుతిస్తూ పుష్పాక్షతలు నిత్యా దేవతకు సమర్పించాలి.
కుడి చేతిలోనికి అక్షతలు తీసుకుని,

**శ్రీ కామేశ్వరీ నిత్యా దేవతాయై నమః సర్వోపచారాన్ సమర్పయామి.**
**శ్రీ కామేశ్వరీ నిత్యా రూప కళాకర్షిణీ శక్తి శ్రీ మహా త్రిపుర సుందరీ దేవీ శ్రీ పాదుకాం పూజయామి నమః తర్పయామి నమః**

అని చెబుతూ చేతి లోని అక్షతలు, అతి కొద్దిగా నీళ్లు అమ్మవారికి సమర్పించాలి.

**16. పూజార్పణం**
కుడి కుడి చేతిలో అక్షతలు తీసుకుని, క్రింది మంత్రాన్ని చదువుతూ, నీళ్లతో పాటు అక్షతలను పళ్లెంలోకి విడిచి పెట్టాలి.

**మంత్ర హీనం క్రియా హీనం భక్తి హీనం శ్రద్ధా హీనం పరమేశ్వరీ**
**యత్పూజితం మయా దేవీ పరిపూర్ణం తదస్తుతే**
**అనయా మయాకృత ఏతత్ పూజా సర్వం కామేశ్వరీ నిత్యా దేవతా అనుగ్రహ సిధ్యర్థం కామేశ్వరీ నిత్యా దేవతా అర్పణమస్తు.**

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఇదే విధముగా మిగిలిన రోజులు, ఒక్కొక్క రోజు ఒక్కొక్క నిత్యా దేవత పూజ చేయవలెను. చివరగా అమావాస్య నాడు మహా నిత్యా దేవత పూజ చేయవలెను.

ప్రతి నిత్యా దేవతకు ఆ దేవత మూలమంత్రము ఉండును. ఈ మూలమంత్రము గురువు గారి వద్ద దీక్ష తీసుకుని పూజ చేయుట మంచిది. అలాగే, ఆ దేవత యొక్క నిత్యా గాయత్రీ మంత్రము, ఆ దేవత యొక్క కళా మంత్రములు ఉండును.

పూర్తి వివరములు Srimeru website ద్వారా పొందవచ్చును.

## కాశీ యాత్రా విశేషాలు

అక్టోబర్ 31 నుండి నవంబర్ 9వ తారీఖు వరఖు వరకు గురూజీ, తమ 115 మంది శిష్య గణంతో సాధన నిర్వహించారు.
ముఖ్య విశేషాలు
• ప్రతి రోజూ ప్రాతఃకాలం 4 గంటలకు గురూజీ సత్సంగంతో ప్రారంభం.
• సంధ్యా వందనము.
• మంత్ర పఠనము మరియు సూక్త పఠనములతో గంగా స్నానము
• 9 రోజుల పాటు రుద్ర హోమం.
• దాని తరువాత గురుమండల పూజ
• తరువాత శ్రీ చక్ర పూజ
• సాయంత్రం వేళలలో వివిధ మందిరాలు మరియు ఆలయ దర్శనం. వానిలో కొన్ని కాశీ విశ్వనాథ మందిరం, అన్నపూర్ణా దేవీ మందిరం, కాశీ విశాలాక్షి మందిరం, కాల భైరవ మందిరం, సంకట మోచన హనుమాన్ మందిరం, కేదారేశ్వర మందిరం మరియు వారాహీ దేవీ మందిరం.
• కేదారేశ్వర స్వామికి ప్రత్యేకమైన అభిషేకములు.
• నవంబరు 6వ తారీఖున వారాహీ దేవీ మందిరం వద్ద పాతాళ వారాహి అమ్మవారి సాన్నిధ్యంలో హోమం.
• నవంబరు 7వ తారీఖు, దేవ దీపావళి రోజున,హనుమాన్ ఘాట్ వద్ద పృథ్వీ శ్రీ చక్ర పూజ, తరువాత గంగా హారతి దర్శనం.
• నవంబరు 8వ తారీఖు, చంద్ర గ్రహణ పర్వదినమందు గంగా నదిలో బోట్ షైర్ మరియో గంగా నదిలో దీపములను వదిలే కార్యక్రమం.
• కార్తికేయ ఏకాదశి నాడు గురూజీ ఆధ్వర్యంలో సత్యనారాయణ వ్రతము.

కాశీ యాత్ర ఫొటోల కొరకు 15వ పేజీ చూడగలరు.



# ప్రత్యంగిరా దేవి మందిరం అయ్యవాడి, తంజావూరు, తమిళనాడు.

**శ్రీ మహా ప్రత్యంగిరా దేవి శక్తివంతమైన దేవత. అంగీరసుడు, ప్రత్యంగిరసుడు అనే ఇద్దరు పవిత్ర ఋషులు ఆమె మూలమంత్రాన్ని, దేవిని స్వయంగా కనుగొన్నట్లు తెలుస్తోంది. అందువలన ఆమె పేరు వాటి నుండి ఉద్భవించింది.**



నరసింహుడు హిరణ్య కశ్యపుని వధించిన తరువాత, అతను ఇంకా చాలా కోపంగా ఉండి, అదే ఉగ్రరూపంలో కొనసాగాడు. శివుడు సింహం ముఖం మరియు గద్ద రెక్కలతో "శరభేశ్వరుడు"గా మరింత శక్తివంతమైన అవతారాన్ని ధరించాడు. శరభేశ్వరుని మూడవ కన్ను నుండి సింహ ముఖం, 18 చేతులతో ప్రత్యంగిరా దేవి ప్రత్యక్షమయింది.

ఆమె శరభేశ్వరుని రెక్కలలో ఒకదానిపై కూర్చుంది. శరభేశ్వరుడు దేవితో కలిసి నరసింహుని కోపాన్ని శాంతింపజేశాడు. దేవతలు మరియు ఋషులు భీకరమైన దేవిని శాంతపరచడానికి వివిధ పవిత్ర హోమాలనుఆచరించారని చెబుతారు. ఆ విధంగా ఆమె "శ్రీ మహా ప్రత్యంగిర" అయింది.

ప్రత్యంగిరా దేవి అధర్వణ వేదం యొక్క ప్రధాన దేవత మరియు ఈమెను అర్ధర్వణ భద్ర కాళీ, అధర్వణ ప్రత్యగీర దేవి అని కూడా పిలుస్తారు. నరసింహిక, ప్రచండ చండిక, నికుంభిల అని కూడా అమ్మవారిని కొలుస్తారు.

మహాభారత కాలంలో పాండవులు ఇక్కడికి వచ్చి తమ రాజ్యాన్ని తిరిగి పొందడానికి పూజలు నిర్వహించారు. అందువలన ఈ ప్రదేశానికి "ఐవర్ పాడి" (5 ప్రశంసలు) అని పేరు వచ్చింది మరియు శతాబ్దాలుగా ఇది "అయ్యవాడి" గా మారింది.



రామాయణ ఇతిహాస కాలంలో - రావణుని కుమారుడు ఇంద్రజిత్తు యుద్ధంలో విజయం సాధించడానికి నికుంభిలా యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞం పూర్తి చేసి ఉంటే, ఇంద్రజిత్ ఒంటరిగా యుద్ధంలో గెలిచేవాడు. ఈ విషయం తెలుసుకున్న హనుమంతుడు, లక్ష్మణుడితో కలిసి వెళ్లి యజ్ఞం పూర్తి కాకముందే ఆ యజ్ఞానికి అంతరాయం కలిగించాడు.

ఇది ఒక పురాతన ఆలయం (1000 సంవత్సరాల కంటే ఎక్కువ పురాతనమైనది). ఈ ఆలయ విమానం ఉత్తర భారత శైలిలో ఉంటుంది. ఈ ఆలయానికి అధిపతి అగస్తీశ్వరుడు, తల్లి ధర్మ సంవర్ధిని. ఇది ఒక ప్రసిద్ధ క్షేత్రం. ఇది జ్ఞాన సంబందర్ పాడిన తేవరం కీర్తనలలో కనిపిస్తుంది.

ప్రత్యంగిర దేవి ఉత్తరాభిముఖంగా ఉంటుంది. దేవి రథం మీద 4 సింహాలతో ఆసీనురాలై ఉంటుంది. ఆమె ముదురు రంగులో సింహం ముఖంతో, శిరస్సుపై చంద్రుడిని ధరించి ఉంటుంది.8 చేతులలో, పాశం, దమగరుం మొదలైన ఆయుధాలను కలిగి ఉంటుంది. ఆమె వెంట లక్ష్మీదేవి, సరస్వతి ఇరువైపులా ఉన్నారు. ఈ దేవత స్వయంభూ గా వెలసినది.

ఈ దేవాలయం 8 దిక్కులలో 8 శ్మశానవాటికల మధ్యలో ఏర్పడి ఉన్నది. స్థల వృక్షం (ఆలయం యొక్క పవిత్ర వృక్షం) అనే చెట్టు, మర్రి, బోధి, మామిడి, ఇచి మరియు పురాసు అనే 5 రకాల ఆకులను కలిగి ఉంటుంది.

**సమర్పణలు మరియు పూజ:**
పూజా సమయాలు : ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. సాయంత్రం – 4.30 నుండి 7.30 వరకు. అమావాస్య రోజున (అమావాస్య) 6:30 నుండి ఆలయం తెరవబడుతుంది.
ఖచ్చితంగా దేవికి వ్యక్తిగత అర్చనలు ఏవీ నిర్వహించబడవు. నెయ్యి, నిమ్మ మరియు మిరపకాయ వంటి వెలుపల నైవేద్యాలు ఆమోదించబడవు. ఆలయం ఆమోదించిన ఏకైక నైవేద్యం మిరపకాయ, దీనిని బహుశా అక్కడే సేకరించాల్సి ఉంటుంది.

అమావాస్య రోజున (అమావాస్య) మీరు భారీ జనసమూహాన్ని ఆశించవచ్చు. బ్లాక్ మ్యాజిక్ మరియు ప్రతికూల శక్తితో ప్రభావితమైన వ్యక్తులు తల్లిని ప్రార్థించడం ద్వారా మరియు ఆమె ఆశీర్వాదం పొందడం ద్వారా ఉపశమనం పొందుతారు. దేవి ఫోటోలను కొని పూజగదిలో ఉంచవద్దని గట్టిగా సలహా ఇచ్చింది. ఆమె ఒక ఉగ్ర దేవత కాబట్టి, చాలా జాగ్రత్తలు తీసుకోవాలి, లేకపోతే అది ఇబ్బందులకు దారితీస్తుంది.

**నికుంభిలా యాగం:**
అమావాస్య రోజున, ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆలయంలో నికుంభిలా యాగం నిర్వహిస్తారు. దీనిలో ఎవరు ప్రదర్శన ఇచ్చినా లేదా పాల్గొన్నా వారు నిజంగా ఆశీర్వదించబడతారు. దుష్ప్రభావాలతో బాధపడేవారు, బ్లాక్ మ్యాజిక్, పదవులు/వస్తువులు కోల్పోయినవారు, అప్పుల భారం నుంచి ఉపశమనం, ఉద్యోగాల్లో పదోన్నతి, పెళ్లి వరాలు, అడ్డంకులను తొలగించి వారిని ఆశీర్వదించమని దేవతను ప్రార్థిస్తారు.



ఇది, దేవతకు 108 వస్తువులను సమర్పించే విస్తృతమైన యాగం. సుమారు 30 కిలోల మిరపకాయలు ఉపయోగించబడతాయి. అయినప్పటికీ అక్కడ కూర్చున్న వ్యక్తులు మసాలా పొగ ఉన్నప్పటికీ ఎటువంటి అసౌకర్యం లేదా ఇబ్బందులను అనుభవించరు. పాల్గొనేవారు మిరపకాయను తీసుకొని, వారి తలపై వృత్తాకార చలనం చేసిన తరువాత యాగంలో సమర్పించమని అడుగుతారు.

యాగ కుండం వద్ద వినాయక, మురుగ, శాస్త్, భైరవ, శరభ, శూలిని, వారాహి, సుదర్శన (విష్ణువు యొక్క చక్రం), మహాలక్ష్మి లను వైదిక నియమాల ప్రకారం యాగ వేదికపై ప్రతిష్టిస్తారు. ప్రత్యంగిరా దేవి కేంద్రంగా ప్రతిష్ఠించబడి ఉంటుంజి. యాగం చివరిలో, దేవి మరియు శరభేశ్వరుడికి పవిత్ర కలశ జలాలతో అభిషేకం నిర్వహిస్తారు.

**అయ్యవాడి ప్రత్యంగిరా దేవీ మందిరం చేరుకునే మార్గాలు**

**విమాన మార్గం**
మందిరానికి 99 కి.మీ. దూరంలో ఉన్న తిరుచురాపల్లి

**రైల్వే మార్గం**
మందిరానికి 15 కి.మీ. దూరంలో ఉన్న కుంభకోణం

**బస్సు మార్గం**
మందిరానికి 15 కి.మీ. దూరంలో ఉన్న కుంభకోణం
కుంభకోణం నుండి నేరుగా గుడి వద్దకు బస్సులు తక్కువగా ఉన్నాయి. తిరునాగేశ్వరం నుండి గుడికి సులభంగా చేరుకోవచ్చును. తిరునాగేశ్వర మందిరం నుండి ప్రత్యంగిరా దేవి గుడి 4 కి.మీ. దూరంలో ఉన్నది.

**సంప్రదించవలసిన చిరునామా:**
అయ్యవాడి శ్రీ మహా ప్రత్యంగిరా దేవి మందిరం
శ్రీ ఎ.యన్. దండపాణి గురుక్కల్,
సన్నిధి వీధి,
అయ్యవాడి
తిరునాగేశ్వరం – 612 204.
కుంభకోణం, తమిళనాడు.
ఫోన్ - +914352463414 & +914352464452
దూరవాణి+919442422053 & +919047881000

## ఉత్సవాలు, కార్యక్రమాలు

### కాశీ యాత్ర ఫోటోలు











# రాబోయే కార్యక్రమాలు



### గురూజీ పర్యటన వివరాలు

డిసెంబర్ నెలలో గురూజీ ఈ క్రింది నగరాలకు పర్యటించనున్నారు. అప్పాయింట్ మెంట్ కొరకు +91 8088256632 నంబరుకు మెసేజ్ పంపగలరు.

నవంబరు 28 నుండి డిసెంబర్ 6వ తారీఖు వరకు – బిలాయ్, మధ్యప్రదేశ్ రాష్ట్రం,
తిరువణ్ణామలై - డిసెంబర్ 10 - 12
హైదరాబాద్ - డిసెంబర్ 20 - 27
మిగిలిన రోజులు – బెంగుళూరు

### గురూజీ ఆధ్యాత్మిక ప్రవచనం

శ్రీ గురు కరుణామయ గారు "ఆధ్యాత్మిక సాధన రహస్యాలు" అనే అంశంపై పిరమిడ్ ధ్యాన కేంద్రం, కడ్తాల్ (హైదరాబాద్ - శ్రీశైలం హైవే) వద్ద ప్రవచనం చేస్తారు. 26 డిసెంబర్ 2022 న సాయంత్రం 5:45 గంటలకు.





### శ్రీ విద్యా తరగతులు

శ్రీ విద్యా తరగతుల తేదీల వివరాలు
ఇంగ్లీష్ మాడ్యూల్ 1&2 – జనవరి 20, 21 మరియు 22 తేదీలు, సాయంత్రం 5 గంటల నుండి 9 గంటల వరకు (భారతీయ కాలమానం ప్రకారం)
తెలుగు మాడ్యూల్ 1&2 – నవంబరు 27, 28 మరియు 29 తేదీలు, సాయంత్రం 5 గంటల నుండి 9 గంటల వరకు (భారతీయ కాలమానం ప్రకారం)
రిజిస్టర్ చేసుకోవడానికి ఈ క్రింద లింక్ ఇవ్వబడినది.
https://srimeru.org/srividya-saadhana

# గురూజీతో నా అనుభవాలు

శ్రీమతి కిరణ్మయి చుండూరు

**శ్రీమాత్రేనమః**

గురూజీతో నా ప్రయాణం 2020 లో ప్రారంభమైంది. నాకు ఎల్లప్పుడూ శ్రీవిద్య నేర్చుకోవాలనే కోరిక ఉండేది. చిన్నతనం నుండి నాకు ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి ఉండేది. నా జీవిత పరమార్థాన్ని తెలుసుకోవాలని అనిపించి, అందుకోసం నా చుట్టూ ఉన్న మార్గాలు ఏమిటి అని వెతకడం ప్రారంభించాను. ఆ విధంగా శ్రీ గురు కరుణమాయ గారిని కలవడం జరిగింది.



గురూజీ నాకు శ్రీవిద్య నేర్పడం ప్రారంభించినప్పటినుండి, నాలో జరుగుతున్న మార్పులను నేను గమనిస్తూ వచ్చాను. నాకు అంతకు ముందు తెలియని ఎన్నో విషయాల గురించిన జ్ఞానం నాకు ఇప్పుడు లభిస్తున్నది.

శ్రీవిద్య ప్రారంభంలో చక్ర శుద్ధి గురించి వివరించబడుతుంది. ఒక్కొక్క చక్రము ఒక్కొక్క స్థితిని తెలియజేస్తుంది.

మూలాధారము – ఘన స్థితి
స్వాధిష్ఠానము – ద్రవ స్థితి
మణిపూరము – అగ్ని
అనాహతము – వాయువు
విశుద్ధి – భూమి
ఆజ్ఞా – ఆకాశము

ఈ చక్రములతో కలిసి ఉన్న తత్వములు

మూలాధారము – భయము, ఆత్రుత, అనుమానము, అహంకారము, జడత్వము, అస్థిరమైన ఆలోచనలు, నిర్లక్ష్య ధోరణి
స్వాధిష్ఠానము – మక్కువ, ప్రేమ, కోరిక
మణిపూరము – శక్తి
అనాహతము – ఇష్టము,అయిష్టము, ప్రేమ, కోరిక,
విశుద్ధి – జ్ఞాన ప్రసార శక్తి
ఆజ్ఞా – భూత,భవిష్యత్,వర్తమానముల జ్ఞానము
ఎప్పుడైతే మనం ఈ పరిధులను దాటి ముందుకు వెళ్లగలుగుతామో, అప్పుడు అమ్మ దగ్గరకు చేరుకునే అవకాశం లభిస్తుంది.

ఈ క్రమంలో, నా జీవితం యొక్క ప్రాముఖ్యత ఏమిటో తెలుసుకోవాలంటే, "నేను, అమ్మ వేరు వేరు కాదు. నేనే అమ్మ. అమ్మయే నేను" అని నేను తెలుసుకోవాలని అర్థం చేసుకున్నాను.

నీవే దేవిగా మారేందుకు నీవు దేవీ ఉపాసన చేయాలి. నీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, ఆ ప్రపంచంలో ఉన్న సమస్త జీవరాశులను ప్రేమించటం ప్రారంభించాలి. నీ చుట్టూ ఉన్న అందరూ నిన్ను ప్రేమించడం ప్రారంభం అయితే నీవే అమ్మవు అయినట్లుగా భావించవచ్చును. అయితే వారిలో కొందరు నీతో చెడుగా ప్రవర్తిస్తున్నట్లు నీకు అనిపిస్తే, ఆ తప్పు మరలా చేయవద్దని అమ్మ నీకు చెప్పటానికి ఆ సంఘటన జరిగినట్లు అర్థం చేసుకోవాలి. ఆ విధంగా అమ్మ నిన్ను ఎందుకు హెచ్చరిస్తుంది అంటే, అమ్మ తన పిల్లలను అందరినీ ప్రేమిస్తుంది, జాగ్రత్తగా చూసుకుంటుంది.

అందరికీ సహాయపడటం అలవాటు చేసుకోవాలి. ప్రతి ఒక్కరిలోని మంచిని ప్రోత్సహించాలి. ఈ విశ్వంలో ఎన్నో నక్షత్ర కూటములు ఉన్నాయి. వానిలో జీవరాశులు కూడా ఉత్పత్తి అవుతూ ఉన్నాయి. మనం భూత, భవిష్యత్, వర్తమానములలో ఉన్నవారమే. దీనిని ఆధారంగా చేసుకుని, జ్యోతిష్య శాస్త్రజ్ఞులు మన జాతకం చెప్పడం వంటివి చేస్తూ ఉంటారు. అది అంతా నిజం కాకపోవచ్చు కానీ, కొంత మేరకు నిజమే అవుతుంది. ఈ నక్షత్ర కూటములు మన ఆలోచనల, మన కోరికలు మొదలైన భావజాలములతో ఏర్పడినవే.

నా మనసు ఆలోచించడం ఆపేసి, కోరికలు లేకుండా, ఎరుకతో ఉంటూ ఉన్నప్పుడు, నాలోని బలహీనతలకు నేను లొంగను. నేనెవరిని? నా చుట్టూ ఉన్న ఈ ప్రపంచం ఏమిటి? ఆ విషయాలు తెలుసుకోవాలనే తపన ఉన్నప్పుడు నాలోని తత్వము నాకు అర్థం అయ్యే అవకాశాలు ఉన్నాయి. నాలోని ఈ తత్వం గురించిన సమాచారం ఒక్కొక్కసారి లోపలి నుండే తెలుస్తుంది. మరి కొన్ని సార్లు బయటి ప్రపంచం నుండి తెలుస్తుంది. మొత్తం మీద ఆ సమాచారం గురించిన తపన నీకు ఉన్నప్పుడు మాత్రమే నీకు ఆ సమాచారం తెలుస్తుంది.

బలహీనత అంటే గురుత్వాకర్షణ శక్తి వంటిది. గురుత్వాకర్షణ శక్తి మనలను భూమి యొక్క కేంద్రం వైపు లాగుతూ ఉంటుంది. భేదం తెలుసుకోవడం కోసం గురుత్వాకర్షణ శక్తిని రెండు విధాలుగా చెప్పుకోవచ్చును.

1. సకారాత్మక శక్తి
2. వికారాత్మక శక్తి లేదా వ్యతిరేక శక్తి

వికారాత్మక శక్తి లేదా వ్యతిరేక శక్తి మనలను క్రిందికి లాగుతూ, భయం, ఆందోళన, తపన, దుఃఖము, కోరికలు వంటి మాయలలో పడవేస్తూ ఉంటుంది. ఈ వికారాత్మక శక్తిని మనం అధిగమించడానికి ప్రయత్నిస్తే, అప్పుడు సకారాత్మక శక్తి మనలో ప్రారంభమై, మనలను అమ్మ దగ్గరకు తీసుకు వెళుతుంది. కనుక మనం చేయవలసిన పని ఏమిటంటే, వ్యతిరేక శక్తులను దాటుకుంటూ, విశ్వాంతరాళంలోకి వెళితే, మనం శూన్యంలోకి వెళతాము. అక్కడ నుండి మనకు అనేక నక్షత్ర మండలాలు, వానిలో ఉన్న మన ఉనికి మనకు తెలుస్తుంది. అప్పుడు ఈ నక్షత్ర మండలాలు వాటికవే వచ్చినవి కావు, నేను – అనగా జీవులు సృష్టించినవే అని అర్థం అవుతుంది. అప్పుడు నీవే బ్రహ్మవు అని నీకు అర్థం అవుతుంది. నేనే బ్రహ్మ అనే వాక్యమును మనం సరిగా అర్థం చేసుకోవడం లేదు. నేనే బ్రహ్మ అనగా, నేను నా ఆలోచనలను సృష్టిస్తున్నాను. నాకు కొన్ని ఇష్టమని, కొన్ని ఇష్టం లేదనే భావనలు నేనే సృష్టిస్తున్నాను. భయము, తపన, కోరికలు మొదలైనవి కూడా నేను సృష్టించినవే.

ఈ విశ్వంలోని నక్షత్ర మండలాలలో, నేను గతంలో చేసిన కర్మలు అన్నీ భద్రపరచబడి ఉంటాయి. అది ఒక పెద్ద డేటాబేస్ గా చెప్పుకోవచ్చును. ఆ డేటా బేస్ ప్రకారం మంచి లేదా చెడు ఫలితాలను నీవు పొందుతూ ఉంటావు.

ఇప్పుడు, ఈ విశ్వంలోని సమస్త నక్షత్ర మండలాల లో నాకు సంబంధించి ఉన్న డేటా బేస్ మొత్తము తుడిచి వేయాలని నేను అనుకుంటే, దానికోసం, నా ప్రవర్తనను, నేను చేసే పనులను పరిశీలించుకుని, అవసరమైన మార్పులు చేసుకోవలసి ఉంటుంది. కర్మను కాల్చివేయాలని చెబుతూ ఉంటారు.

ఈ విశ్వంలోని సమస్త నక్షత్ర మండలాలలో ఉన్న నీకు సంబంధించిన డేటా బేస్ ను కర్మ అని చెప్పుకోవచ్చును. దీనిని మొత్తం తుడిచి వేయడం చాలా కష్టమైన పని. కానీ అమ్మవారి పాదములు శరణు పొందినప్పుడు సులభ సాధ్యం అయిపోతుంది.

చాలా సందర్భాలలో మనకున్న ఒక ప్రధానమైన సమస్యను మనం నిర్లక్ష్యం చేసి ముందుకు వెళ్లిపోతూ ఉంటాము. చాలాసార్లు మాయలో పడిపోతూ ఉంటాము. అనేక సార్లు విఫలమైనప్పటికీ, మనం ఎక్కడ తప్పు చేస్తున్నామో మనకు అర్థం కాదు. ఈ మాయ కారణంగా మనం ఏమి చేయాలో కూడా తెలియకుండా అయిపోతూ ఉంటుంది.

నా జీవితంలో ఈ రోజును నేను చాలా గొప్పగా, తేజోవంతంగా ఉండే విధంగా చేసుకునే ప్రయత్నం చేయాలి. అందరికీ సుప్రీమ్ అయినటువంటి అమ్మతత్వంతో అనుసంధానం చేసుకోగలిగితే, కర్మను ఎలా భస్మం చేసుకోవాలో మనకు తెలిసే అవకాశం ఉన్నది. ఈ ఉన్నతమైన విద్యను నాకు నా గురువు ప్రసాదించారు. ఈ విషయాలు ఎప్పుడైనా అడిగి, నా సందేహాలు తీర్చుకోవడానికి నాకు ఒక సద్గురువు లభించడం నా అదృష్టం గా భావిస్తున్నాను.

మనకు సంబంధించిన భూత, భవిష్యత్, వర్తమానములను మార్చుకునే అవకాశం ఉన్నదా?

ఉన్నది. నీవు నీ భూత కాలము, భవిష్యత్ కాలములను మార్చుకోగలిగితే, వర్తమానమును కూడా మార్చుకోగలవు. అయితే అది చేయాలంటే గురువు అవసరం. గురు చరణముల నాశ్రయించి, అనుగ్రహం పొందినవాడు సుధా సాగరం అనే అమ్మ తత్వం వైపుకు లాగబడతాడు.

ఒక యంత్ర పూజ, ఒక అష్టోత్తరము చేసినంత మాత్రాన ఎల్లప్పుడూ గురువుతో నీవు కనెక్ట్ అయి ఉన్నావని అనుకునే అవకాశం లేదు. తత్వమును గురించి తెలుసుకోవాలనే జిజ్ఞాస, తపన ద్వారా, మరియు, ప్రతిఫలాపేక్ష లేకుండా గురువు చెప్పినవి పాటించే ప్రయత్నం చేయడం ద్వారా, గురువుతో కనెక్ట్ అయి ఉండే అవకాశం ఉన్నది.

మన శ్రీ విద్యా పీఠమును నిర్వహించుటలో తమవంతు సహకారం అందిస్తున్న అందరు సాధకులకు, గురువు గారికి, మనఃపూర్వక ధన్యవాదములు. నా అనుభవాలు మీతో పంచుకునే అవకాశం ఇచ్చినందుకు అందరికీ ధన్యవాదములు.

చివరిగా, మన శ్రీ విద్యా పీఠం కోసం స్థలం ఏర్పాటు చేసుకునే విషయంలో సహకరించవలసినదిగా అందరినీ వేడుకుంటున్నాను.



## భగవంతుని పూజా కార్యక్రమాలు లేదా జపాలు ఏకాంతంలో చేయడం అవసరమా?

ప్రశ్న – కొందరు సాధకులు దైవ ధ్యానము లేదా పూజలను ఏకాంతంగా చేస్తూ ఉంటారు. ఆ సమయంలో ఎవరైనా వచ్చి తాకినా కూడా వారు కోపం తెచ్చుకుంటూ ఉంటారు. అంత ఏకాంతంగా అభ్యాసం చేయడం అవసరమేనా?

సమాధానం – ప్రస్తుత రోజుల్లో చాలామందికి వచ్చే సాధారణమైన సందేహమే ఇది. ఎవరైనా పూజ చేసేటప్పుడు ప్రాపంచిక స్థితిలో కాకుండా ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక స్థితిలో ఉంటారు. ప్రాపంచిక స్థితికి, ఆధ్యాత్మిక స్థితికి చాలా తేడా ఉన్నది. ఆ ఆధ్యాత్మిక స్థితిలో ఉన్నప్పుడు, ప్రాపంచక స్థితిలో ఉన్న వ్యక్తులు లేదా ఏమైనా వారిని తాకినప్పుడు, ఆధ్యాత్మిక స్థితికి బంగం కలుగుతుంది.

శ్రీ విద్యా తత్వం ప్రకారం, ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి కర్మను లేదా కర్మ ఫలితాన్ని బదిలీ చేయవచ్చును. అది కూడా పంచ తత్వముల ద్వారా – అనగా దృష్టి – అనగా ఇతర విషయములను గమనించడం , శ్రవణము అనగా ధ్వనులను వినడం, ఘ్రాణము అనగా వాసన చూడటం , రుచి చూడటం మరియు స్పర్శ – అనగా తాకడం. వీనిలో స్పర్శ అనగా తాకడం చాలా ముఖ్యమైనది. బయటకు వెళ్లి వచ్చిన వ్యక్తి పూజ చేసే వ్యక్తిని తాకడం వలన అతని ఏకాగ్రత తగ్గుతుంది. ఎందుకంటే పూజ చేసే వ్యక్తిలోని ఆధ్యాత్మిక శక్తి, అవతలి వ్యక్తికి బదిలీ అవుతుంది.

కోవిడ్ కారణంగా అందరూ ఆరడుగుల దూరాన్ని పాటించడం అలవాటు చేసుకున్నారు. కళ్లకు కనబడని వైరస్ ఏ విధంగా ఎదుటి వ్యక్తికి వ్యాపిస్తున్నదో, అదే విధంగా ఇతర విషయములు అనే వైరస్ లను మన దగ్గరకు రాకుండా మనం జాగ్రత్త పడాలి. పూజా సమయంలో కూడా, మనలో చాలామంది, పారివారిక విషయములు, ప్రాపంచిక విషయముల

గురించి ఆలోచిస్తూ, చర్చిస్తూ తమలోని శక్తిని కోల్పోతూ ఉంటారు. కనుక పూజా సమయంలో పారివారిక విషయాలను, ఇతర విషయాలను గుర్తుకు తెచ్చుకోకుండా, కేవలం పూజ మీదనే దృష్టి ఉంచి శక్తిని పెంపొందించుకోవాలి కనుక ఎవరినీ తాకకుండా ఉండడమే మంచిది.

కానీ, ఇంతకంటే ఎక్కువగా దీనికి ప్రాధాన్యం ఇవ్వకూడదు. పూజా సమయంలో ఇంట్లో ఉన్న చిన్నారులు ఎవరైనా వచ్చి తాకితే, వారిమీద కోపం తెచ్చుకోవడం, వాళ్లను అరవడం చేయకూడదు. ఎవరినీ తాకకుండా ఉన్నప్పటికీ పూజమీద ఏకాగ్రత కుదరక పోవచ్చును కదా! కనుక, మనసును ఈ వ్యవధానాల పైకి పోకుండా, పూజ వైపునే ఏకాగ్ర చిత్తులై చేయడం అవసరం. భౌతికమైన ఏకాంతం కంటే మానసిక ఏకాంతం చాలా ముఖ్యమైనది.
మన శరీరంలోని అయిదు జ్ఞానేంద్రియాలు, అయిద కర్మేంద్రియాలు అంతర్ముఖమై, బాహ్య ప్రపంచంలోకి పరిగెత్తకుండా ఉండేందుకు ప్రయత్నించాలి. ఇదే నిజమైన ఏకాంతం.

పూర్వకాలంలో మన ఇంటిలో పెద్దలు, బయట నుండి రాగానే కాళ్లు కడుగుకొని రమ్మని చెప్పేవారు. ఇప్పటికీ కూడా కొన్ని గ్రామాలలో ఈ పద్ధతిని పాటిస్తున్నారు. ఇంటికి వచ్చిన అతిథులకు కూడా తప్పనిసరిగా కాళ్లు కడుక్కుని లోపలికి రమ్మని చెబుతారు. కోవిడ్ సమయంలో ప్రజలందరూ చేతులు సబ్బుతో రుద్దుకోవడం ప్రారంభించారు. అమ్మ ఎప్పుడూ కూడా మనకు సరైన మార్గం చూపిస్తూ ఉంటుంది. ఆహార పద్ధతులలో శాస్త్రాలలో చెప్పిన విధానాలు పాటించక పోవడం వల్లనే కోవిడ్ 19 ఉత్పన్నం అయింది. మనం ఏమి తినాలో ఏమి తినకూడదో అనేది నిర్ణయించుకోవడానికి కూడా శాస్త్రాలు అనుసరించవలసి ఉంటుంది.

మనం ఇంటి నుండి బయటికి వెళ్లినప్పుడు, బయట తిరుగుతున్నప్పుడు, శనీశ్వరుడు మన కాలి చీలమండల దగ్గరకు వచ్చి చేరుతాడు. మనలను నిరుత్సాహవంతులుగా చేస్తాడు. కనుక, కోవిడ్ సమయంలో మాత్రమే కాకుండా, మామూలుగా కూడా మనం ఇంటిలోనికి ప్రవేశించేటప్పుడు కాళ్లు కడుక్కుని రావాలి. కరోనా వ్యాధి సమయంలో ప్రజలందరూ , “కరోనా కరోనా” అని నామ జపం చేశారు. అదే , శాస్త్రజ్ఞులు “నారాయణా” అని పేరు పెట్టి ఉంటే, ఈ పాటికి నారాయణ కోటి నామ జపం అయిపోయి ఉండేది. మన పెద్దలు, కొన్ని విలువైన కారణాల కోసం ఈ నియమాలను పెట్టారు. వాటిని మనం పాటించాలి. కానీ వాటినే చాదస్తాలుగా ఎక్కువ చేయకూడదు. ఆ నియమాలను అవసరమైన విధంగా పాటిస్తే, ప్రాపంచిక మరియు ఆధ్యాత్మిక లక్ష్యాలను చేరుకునే ప్రయత్నం చేయవచ్చును.

సూక్తి

**మార్పు అనేది బాహ్య ప్రపంచం నుండి ఆశించకుండా, నీ లోపల నుండే ఆ మార్పు రావాలి అని శ్రీ విద్య బోధిస్తుంది.**

~ శ్రీ గురు కరుణామయ


gurUvaani

Srividya Learning Centre
#69, 6th Cross Street,
Girinagar Phase I, Bengaluru,
KA 560085, India.

srimeru999@gmail.com
+91 8088256632
www.srimeru.org